# దీవెన

హైదరాబాద్‌లో ఆనాటి గదిలో నా కోరిక ప్రకారం ఆ రోజు మా సమావేశం ఏర్పాటయింది. ప్రత్యేకాహ్వానితుడు సుబ్బారావు. సుబ్బారావు నా ప్రాణమిత్రుడు. అతను నాతోపాటు చదువుకునే రోజుల్లో పద్మ కూడా చదువుకుంది. మిస్ పద్మ పట్ల సుబ్బారావుకి అమితమైన భక్తితోపాటు ప్రేమకూడా వుండేది.

సుబ్బారావు గొప్పవాడు గనక అతని మాటలుకూడా గొప్పగానే వుండేవి. అతనా రోజుల్లో (అరిగిపోయిన గ్రాంఫోన్ రికార్డులా) తరచూ అతని ప్రేమ గురించి నాకు చెబుతూండేవాడు.

“ఒరే గురో” పద్మెంత అందంగా వుంటుందిరా, కళ్ళద్దాలు వెధవ్వి నీకు నచ్చలేదుగాని ఆ పిల్లకెంత బావుంటాయిరా, నన్నడుగుతే పద్మకి రెండు జడలు బాగుండవు. ఒకటే

పొడుగాటి జడైతే బ్రహ్మాండంగా వుంటుంది. బట్-నేనెలా ఆ విషయం చెప్పేదీ? పోగా, ఏం గతిలేనట్టు ఆ అమ్మాయి ఒంటెద్దుబండిమీద కాలేజీకి రావడంకూడా నాకిష్టంలేదు. అందుచేత నేనా పిల్లని పెళ్ళాడేసి, మా నాన్నని అడిగి ఒక కారుకొంటాను. లేటెస్టు మోడల్ ఏదైనాసరే, కారుని కొని నేను స్టీరింగ్ దగ్గర, నా ప్రక్కన పద్మ. అవునోరేయ్, కారులో స్టీరింగ్ కుడిప్రక్కనుంటుందా యెడం ప్రక్కన్నా, ఏదో ఒక ప్రక్కన అక్కడికది అయ్యిందా. ఆపైన మా కారు జోరుగా పోతూండగా బైట వర్షం, అప్పుడు గాజుతలుపులు ఎత్తేస్తే. బైట వర్షం చలి, లోన వేడి. బయట జనం తడిచి చస్తారు. లోపల మేం వెచ్చగా కూర్చుంటాం. కారుని ఓ చోట ఆపి.

(పద్మని ప్రేమించాలని చెప్పుకుంటున్న ఈ సుబ్బారావులాంటి గొప్పవాడెవడైనాసరే, ఖర్మంకాలి పద్మని పెళ్ళి చేసుకున్న తర్వాత, వాడి ప్రేమ పద్మ యొక్క కారుమీదా పద్మ దుస్తులూ, నగలమీద కేంద్రీకరించబడి పద్మనబడే శాల్తీమీది ప్రేమ దుమ్ముకొట్టుకుపోతుందని నాకు భయంగా వుండేది.)

ఇన్ని కలలుకనే బోడివెధవ జీవితంలో ఏంసాధిస్తాడోనని నేను కొన్నాళ్ళుగా చూస్తున్నానుగదా. ఒక్కటిమచ్చుకి ఒక్క సరదానైనా నిజం చేసులేకపోయేడు.

పద్మని వాడు నీడలా వెంబడించేవాడు. ఎద్దుబండి వెనకాతల నత్తలా నడిచేవాడు. వాడికున్న కొత్త సైకిల్ని

నాబోటివాడికి దానంచేసి మరీ తిరిగేడు. లక్షాధికారి బిడ్డడు. ఎండమొహం తెలీని పసివాడు. యాపిల్‌పండులాంటి కుర్ర వాడు. పద్మవల్ల వాడు త్త సన్నాసైపోయేడు.పదిమందిలోనూ వాడు అల్లరైపోయాడు. ఇదంతా ఏడెనిమిది సంవత్సరాల క్రితం.

రెండురోజుల క్రితమే పద్మగురించి నేనో మహ త్తర మైన విషయం విన్నాను. అది సుబ్బారావుకి చెప్పేందుకు ప్రత్యేకంగా హైదరాబాద్ వచ్చి ఆచారిగదిలో మా సమా వేశం ఏర్పాటుచేశాను. ప్రస్తుతం సుబ్బారావు హైద్రాబాద్ లోని కంట్రాక్టు పనులు చూస్తున్నాడు. గనుక నేనీ నగరం రాక తప్పలేదు.

మా సమావేశం పెద్ద యెత్తులో జరిగేందుకు రెండు సోలాన్ విస్కీ సీసాలూ, మూడు గోల్డెన్ ఈగిల్ బీరు బాటిలూ ఆచారిచేతనే తెప్పించేను. వాటితోపాటు కొన్ని ఖరీదైన తినుబండారాలూను.

సరిగ్గా అయిదున్నరకు సుబ్బారావు వచ్చేసేడు. వస్తూనే అడిగేడు.

"ఏమిటిగురూ! హంగామా! ఆచారిగాడొచ్చి పార్టీ వుందని చెప్పేడేగాని, వివరాలు తెలీవన్నాడు ఏమిటికథ?"

నేను ఆచారివేపు చూసేను.

"అవున్రా, యివాళ సాయంత్రం సుబ్బారావుకు పార్టీ యిస్తున్నానని చెప్పేవేగాని, వివరాలు నాగ్గూడా చెప్పలేదుగా మరి" అన్నాడు ఆచారి నాన్సుతూ.

నాకుగర్వం పెల్లుబికింది. వీళ్ళందరూ కానబియాం కాలు. నేనేది చెబితే అది కళ్ళుమూసుకుచేసే జాతిమనుషులు. నేను చదువుకునే రోజుల్నుంచీ నాకు మనుషుల్ని వాడుకునే అలవాటుంది. నాతో తిరిగే మనుషుల్ని నేనతి గమ్మత్తుగా మంత్రించి బొమ్మల్లా తయారుచేస్తాను. నా జాదూప్రకారం వాళ్ళు నేనేది చెబితే అది చేస్తారు. నేను కా అంటె కా. కీ అంటె కీ. అలా. నా మాటకి తలొంచి తిరిగే మనుషు లంటే నాకు అత్యంతాభిమానం.

నేను సుబ్బారావుతో అన్నాను.

"ఇవాళిక్కడ ఆచారి గదిలో మనం ముగ్గురమే వున్నాం, నేనీ మందుపార్టీ నిమిత్తమే బందర్నుంచి ఇంత దూరం వచ్చేను. ఆ ఊళ్ళో మనం మందు పుచ్చుకోమని మీకు తెలిసిందేగా. పోతే, ఈ పార్టీ యిచ్చేందుక్కారణం మీక్కావాలి. ఆల్ రైట్ — నేనోకథ చెబుతాను. అదే కారణం,"

"కథా!" అన్నాడు ఆచారి ఉత్సాహంగా.

"బడాయిపోకురా బాబ్జీ. నాకు ఒళ్ళుమండిపోతోంది. అవతలెన్నో అర్జంటు పనుల్ని తగలేసి యిటొచ్చేను. వేళా కోడ మాడకు."

"షటప్ యూ సిల్లీ..."

నాకేకతో సుబ్బారావు ఠక్కున నోరుమూసేడు.

"నేను చెప్పబోయేకథని మీరు చచ్చినట్టు విని తీరా ల్సిందే, కథ పూర్తయ్యేంతవరకూ ఎవడూ యిక్కడ్నుంచి కదలకూడదు. తెలిసిందా?"

వాళ్ళిద్దరూ తలలూపేరు. సీసాలు ముందుకు లాక్కు న్నాను. వాటిమీద బిరడాలూడదీసేను. మూడుగ్లాసుల్లోనూ వ చేను, ముగ్గురం ఒకేసారి తాగుదామనుకున్న ఉద్దేశం ఆచారి బెరుకుతనంవల్ల చెడిపోయింది, తాగుతూ కథ చెప్ప డం ప్రారంభించేను.

♦ ♦ ♦

తేదీ నెల గుర్తులేదుగానీ - ఏడాది క్రితం ఒకరాత్రి బెజవాడ బస్‌స్టాండ్‌లో తిరుపతి బస్సుకోసం యెదురుచూస్తూ నించున్నాను. అప్పుడే ఆచారి నా ప్రక్కనే వున్నాడు. రాత్రి తొమ్మిది దాటింది. ఆచారి ఆవలించడం గమనించి విసు క్కోవాలనుకున్నానుగాని, గతరాత్రి మా ఇద్దరికీ నిద్రలేని కారణంగా వాడిని క్షమించాను. అవుతే, నాఅవస్తని గమ నించిన ఆచారి నోటికి ఏటికవేసి నవ్వి అన్నాడు.

"సినీమా చూస్తున్నంతసేపూ నిద్రరాలేదా? ఇప్పుడు చూడు ముంచుకొస్తుంది - అందుచేత నేను ఇంగ్లీషు సినిమా లంటే పడిచస్తాను. ఏం సినిమారా బాబూ! చూస్తుంతసేపూ తల తప్పేందుక్కూడా మనసొప్పలేదు."

మే మప్పుడు చూచిన సినిమా కేవలం బూతుసినీమా! చాలా తోకలేని సెక్సుసినిమా. చాలావరకు సెన్సార్‌వారు కత్తిరించేసి జాలికొద్దీ కొంచెం మిగిల్చిన ఎంగిలి సినీమాఅది ఆచారి "టేస్టు" చాలా చిత్రంగా వుంటుంది మరి.

అయిదు నిమిషాలు వాడు ఆ సినీమాగురించే మాటా డేడు. ఆ తర్వాత, బందరునుంచి అప్పుడే బస్టాండులోకివచ్చిన తిరుపతి బస్సునిచూచి గట్టిగా, ఆనందంగా అరిచేడు.

"అదిగోరా బాబు తిరుపతి!"

ఆ బస్సుని చూచింతర్వాత వాడిబళ్ళు గాల్లో తేలినట్టయి పోయింది. వాడు నాతోపాటు తిరుపతి రావడంలేదు. గతరోజున్నరనుంచీ వాడి ప్రాణాన్ని తింటూన్న ఒక జంతువు కొన్ని నిమిషాల్లో ఆ బస్సెక్కి వెళ్ళిపోతుందనే నమ్మకంకొద్దీ వాడు అల్లాడిపోతున్నాడు.

బస్సువచ్చి ఆగింది. ఆ కండక్టరు కిందికి దిగింతర్వాత, అతన్ని కలుసుకుని నాకున్న బస్‌పాస్ చూపించాను. అతనా పాస్ చూస్తూనే విష్‌చేసి, వినయంగా అన్నాడు.

"మూడే సీట్లున్నాయిసార్! సెవెన్, ట్వంటీ, ఫోర్టీన్. ఏదో ఒకటి కోరుకోండి."

"ఫోర్టీన్" అన్నాడు ఆచారి చాలా తొందరగా.

ఆచారివేపు చూసేను. అతను చాలా హడావిడిగా వున్నట్టున్నాడు. ఎంత తొందరగా నన్ను బస్సెక్కించి వెళ్ళిపోదామా అనే ఖంగార్లో వున్నాడు. జాలీ నవ్వూ రెండూ కలిగేయి, నేను బస్సెక్కి ఫోర్టీన్లో కూచుంటూ నా పక్కసీట్లు చూసేను. ఆ రెండూ ఖాళీగానే, ఉన్నాయిగానీ ఆ జాగాల్లో ఒకసంచీ, ఒక పెరీమేసన్ పుస్తకమూ వుంచబడ్డాయి. క్రింద ఆచారి సిగరెట్ ముట్టించుకుంటో అన్నాడు!

"మదరాసు వెడతా వేవిట్రా?"

"వెళ్ళను."

"పోన్లే ఇంకోమారెళ్ళచ్చు, ఏమంటావ్?"

ఆచారిని యింకో కొంతసేపలాగే నుంచోబెట్టి యేడి పించాలని వుంది. నోటి కొచ్చినట్టు పేలుతున్నాడు వెధవ! అందుచేత నాకై నేను వాడిని వెళ్ళిపొమ్మని చెప్పకూడ దనుకున్నాను. రెండు నిమిషాలు మా యిద్దర్లో యెవ్వరం యేమీ మాట్లాడుకో లేదు.

బస్సులోకి ఒక యువతీ, ఒక యువకుడూ వొచ్చేరు. ఇద్దరూ యెంతో అందంగా వున్నారు. ఎక్కువసేపు వాళ్ళని చూడాలని వుందిగాని సభ్యత గుర్తుకొచ్చి జేబులు వెతుక్కో వడం ప్రారంభించేను. పర్టు జేబులో వుంది సిగరెట్టు పాకెట్టు. అది అందుపుచ్చుకుని అగ్గిపెట్టెకోసం వేట ప్రారంభించేను. ఆ వేటలో సరిగ్గా నా నెత్తిపైన అందమైన గొంతు వినిపించి నిలువెల్లా జలదరించేను.

"లెట్ మి గో దట్ సైడ్ ప్లీజ్!"

నవవధు తలుపు దగ్గర మాటాడినట్టున్న ఆ మాటల్ని మళ్ళా ఆ దేవతనుంచి వినాలని కోరిక కలిగింది. నేనది విని పించుకోనట్టు నటించి జేబునుంచి అగ్గిపెట్టె తీసేను.

కాని ఆచారి నా కోరికని తినేసేడు వెధవ! కింద నించున్నవాడు తిన్నగా నుంచోక—వాడి సొమ్మేదో పోయి నట్టు గావుకేక పెట్టేడు.

"లేవరా బాబ్జీ! ఆవిడ సీట్లోకి వెళ్ళాలిట."

వళ్ళు మండిపోతుండగా లేచి నించుని చోటిచ్చేను. ఆ అమ్మాయికంటె ముందు, ఆమె వెంటవచ్చిన కుర్రా...

వచ్చి నా కవతల సీట్లో కూర్చున్నాడు. ఇక మిగిలింది మా యిద్దరిమధ్య సీటు. దాన్లోనే ఆ లతాంగి కూచుంటుందని తెలిసి, ఆనందం కలిగింది. కొంచెం గాలి పీల్చుకుందామని బస్సుదిగి ఆచారి దగ్గర కొచ్చేను.

ఆచారి దిగులుగా అన్నాడు.

"దిగొచ్చావేరా! వెళ్ళేళ్ళు. బస్సు కదిలే టైమైంది."

"పాపం నువ్వింకా యెంతసేపు నుంచుంటావుగాని వెళ్ళిపోరా చారీ! నీ నిద్ర కూడా—"

"అదేం మాటలే! నీ బస్సెళ్ళిం తర్వాతే నేను వెడతాను. ముందు నువ్వు బస్సెక్కు."

"నో...నో...ముందు నువ్వే వెళ్ళాలి."

"కాదులేరా బాబూ! ముందు నీబస్సే వెళ్ళాలి."

"చంపేస్తాను వెధవా! వెళ్ళిపో."

"బాబ్బాబుగా, కొంచెం సేపుండరా ప్లీజ్! వెధవ్వి, నీ పాదంలో యేముందో గాని-యెప్పుడూ నక్కతోకనే తొక్కుతుంటావ్. నువ్వెక్కే బస్సు ప్రతిదీ కళకళలాడిపోడం రూలైపోయింది. నువ్వు తంతావని నేను రావడం లేదుగాని-లేకపోతేనా, టిక్కెట్టుకొని యీ బస్సెక్కేసే వాడిని. నీకు నమస్కారం చేస్తా. నువ్వు బస్సెక్కరా అంద్రీ! నీతో మాట్లాడుతూ ఆ పిల్లని కాసేపు చూచే అవకాశం దక్కించుకుంటాను ప్లీజ్—" ఆచారి ప్రాధేయపడ్డాడు. చివరికి వాడి

పంతమే నెగ్గింది. మా బస్సు కదిలిం తర్వాతనే వాడు అక్క-డ్నుంచి కదిలేడు

నా పక్కనున్న యువతి కళ్ళజోడు తొలగించి నన్ను చూస్తూ అన్నది.

"నన్ను మరచిపోయేరులా వుంది."

ఆచారికి చెప్పడమెందుకని చెప్పలేదుగాని, ఆ పిల్లని నే నింతకు ముందే గుర్తించాను.

"ఇంకా నయం, నేను గుర్తున్నానో లేదో అనుకున్నాను. మీ పేరు పద్మ కదూ?" అన్నాను.

"థేంక్స్. గుర్తున్నాను గనక థేంక్స్. ఇతను రామానుజం. నా క్లాస్‌మేట్" అని పద్మ ప్రక్కనున్న మనిషిని పరిచయం చేసింది.

"నా పేరు బాబూరావు" అని రామానుజానికి నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

"బాబ్జీ అనే పేరుతో కథలు రాస్తుంటారు. చూళ్ళే" అన్నది పద్మ.

"సారి! నేను కథలు చదవను" అన్నాడతను కటువుగా.

రామానుజం మెడమీద లాగిపెట్టి కొడదామనుకున్నాను. పూర్ ఫెలో—పద్మ పక్కనుండి బతికిపోయేడు. కథలు రాయడం తమాషా అనుకుంటున్నాడల్లే వుంది.

"మీరెందాకా?" అడిగేను పద్మని.

"ఎక్కింది తిరుపతి బస్సు. వెళ్ళేదీ అక్కడికే. మీరూ అక్కడికేనా?"

"ఆహా..." అన్నాను.

"గుడ్. మంచి కంపెనీ" అన్నది పద్మ.

బస్సు నడుస్తుండగా, పద్మ వుండి వుండి నాతో యేదో, చెబుతూనే వుంది. కొన్ని విన్నాను, కొన్ని వినలేదు. ఎంత వద్దనుకున్నా పాడు నిద్రకు లొంగిపోయేను.

నెల్లూరు చేరుకున్న తర్వాత కళ్లు తెరిచేను. ఇంత సేపూ నేను గాఢ నిద్రలో మునిగినవైనం గుర్తుకొచ్చి నవ్వుకున్నాను. నా పక్కన కూర్చున్న పద్మ రామానుజమిద్దాదకు పూర్తిగా వొరిగిపోయి వుంది. వాళ్ళిద్దరూ యిద్దర్లా కనుపించలేదు నాకు.

నేను త అసూయాపరుడ్ని. నాకు లేని ఆనందం, నేనెరుగని సుఖం, నాకు తెలీని రుచి—ఎదటి వాడెవడైనా సరే అనుభవిస్తున్నట్టు పసిగడతే నాకు కడుపుమంటగా వుంటుంది. వినేందుకు ఎదటవాడు సిద్ధపడితే నేనేమను కుంటున్నదీ స్పష్టంగా చెప్పగలను కూడా.

పద్మ ఢిల్లీలో వాళ్ళన్నయ్య దగ్గరుండి, అక్కడే మెడిసన్ చదువుతున్నట్టు యిందాక చెప్పింది. ఎంత మెడికో అయితేనేం, పట్టపగ్గాలెకుండా పరాయిమగవాడితో యింత రాసుకు తిరగడం విడ్డూరమే. (రామానుజం స్థానంలో నే నుంటే అది విడ్డూరం కాదని రాసిస్తాను. అది వేరే విషయం.)

నెల్లూర్లో దిగి టీ తాగుదామనుకున్న వాడిని, టీ తాగేందుకు దిగకుండా వాళ్ళిద్దర్నీ చూస్తూ కూర్చున్నాను. కాసేపటికి బస్సు కదిలింది.

డాక్టరీ చదివే మనుషులకి "ఎనాటమీ" పూర్తిగా తెలీడం మూలంగా, సెక్సు ఎలిమెంట్‌ని వాళ్ళు కోర్సు పూర్తయ్యేలోగా దూరం చేసుకుంటారనే దురభిప్రాయం కల వాడిన్నేను. కనక–పద్మ అటు రామానుజమ్మీదకు వొరిగినట్టే ఇటు నా మీదకూడా వొరగవచ్చుగదా.

ఒక గొప్ప ప్లాన్ వేసేను. నిద్ర నటించిన చాలా సేపటికి నేనే పద్మవేపు వొరిగేను. నేను పద్మమీదకి వొరగడమే కాకుండా, మెల్లిగా ఆమెని నావేపు వొరిగేటట్టు చేసుకున్నాను.

ఉదయం తొమ్మిదిగంటల ప్రాంతాన తిరుపతిలో దిగేం. ఎకాఎకిని యెగువకి వెళ్ళిపోదామనుకున్నాను. పద్మ వెంటనే రాలేనన్నది. కనీసం, ఆ వొక్క–రోజూ కింద గడిపి తర్వాతరోజు ఉదయమే స్వామి దర్శనం చేద్దామన్నది. దానికి రామానుజం తలూపేడు. రామానుజం గంగిరెద్దు. నేనూ వాళ్ళ కోరిక ప్రకారం ఆగిపోక తప్పింది కాదు.

ఒక గది పుచ్చుకున్నాం. స్నానాలు ముగిసింతర్వాత కాసేపు బాతాఖానీ జరిగింది. మాటల్లోనే రామానుజం నిద్రలోకి జారుకున్నాడు. నిద్రకాగలేని మనుషులంటే నాకు చెడ్డ చిరాకు. పద్మ మొహం చూచి రామానుజాన్ని నేనేమీ అనలేకపోతున్నాను.

ఆ మధ్యాహ్నం భోజనాల తర్వాత రామానుజం మళ్ళా నిద్ర సీన్‌కి జారుకున్నాడు. అతను నిద్ర పోతూండగా పద్మ అన్నది—

"వొట్టి నిద్ర మనిషి. వాళ్ళమ్మా నాన్న యితన్నలా పెంచేరు పాపం!"

"కొందర స్వభావం నిద్రకోసం మొహం వాచి వుంటారు. వాళ్ళ జీవిత కాలమంతా యీ నిద్రలోనే గడిపినా దిగులుపడరు. నన్నడుగుతే యీ జాతి మనుషులు నిద్ర పోడం మినహాయించి మరో తెలివిగల పని చేయలేరని చెప్తాను" అన్నాను.

"అది తప్పు" అన్నది పద్మ.

నిద్రనే గతిమాలిన సంగతిపట్ల నాకు అభిమానం లేక పోవడంచేత నేనెక్కువసేపు పద్మతో వాదించలేదు. పద్మ చీట్లపేకని తీసింది. పేకని కలుపుతూ అన్నది—

"మీకు చాతవునా?"

"కొంచెంగా వచ్చు."

"అవుతే చేయి కలపండి, కట్‌జోకరేద్దాం. స్టేకెంత?"

"అది కూడా మీరే చెప్పండి."

"అయిదు పైసలు—నేషనల్."

"ఆల్‌రైట్" అనేసేను ఉత్సాహంగా.

పద్మనే ఆడపిల్ల (అందమైనది) పేకాటలో నిపుణురాలని నా కిప్పుడే తెలిసింది. పేకఆటలో మొదలెట్టిన గంటలో నా దగ్గిర్నుంచి పన్నెండురూపాయిలూడగొట్టేసింది. పద్మ

పేకాటానుభవాన్ని ఆట మధ్యలో అక్కడో ముక్క ఇక్కడో ముక్కగా చెప్పింది.

"మాకు సీనియర్ ఒకతనుండేవాడు. మిస్టర్ పాల్. అతను క్రిస్టియను కాదు. పూర్తిపేరు గోపాలం. మన వేపు వాడే. పాల్‌కి నాతో ఆడాలని మహా గొప్ప సరదా. అతని క్వార్టర్స్‌కి నేనొచ్చి పోయే నిమిత్తం టాక్సీఫేర్ కూడా అతనే భరించేవాడు అతను మీ అంత తెలివైన ఆటగాడూ కాదు. సీక్వెన్స్ కట్టడమే చాతకాదు. నాలుగు జోకర్లు పేకలో కలిస్తే అతని ఖంగారు వర్ణనాతీతం. ఖచ్చితంగా రాంగ్ షో తిప్పేస్తాడు అతనోడిపోని రోజు లేదంటే నమ్మండి. అయినాసరే, నాతో అతను పేకాట మానేవాడు కాదు, అతనంటే నాకు చచ్చేంత జాలి. ఒకసారేమైందో తెలుసాండీ— అతను విపరీతంగా సిగరెట్లు కాలుస్తూంటాడులెండి ఆ అలవాటుని మాన్పించాలని నేనో ఎత్తువేసి అతన్తో అన్నాను. 'మిస్టర్ పాల్! మీరారా కాష్టదహనం మానుకుంటేనేగాని. నేను మీతో పేకాట ఆడనావటాని' అంతే బంద్. ఇప్పటికొచ్చి అతను సిగరెట్లు కాల్చడం చూళ్ళేదు నేను. నేనంటే అతనికి అంత భక్తి. విచిత్రంగా వుంది కదూ!"

"లేదు" అన్నాడు.

"ఎందుకనిటకీ?"

"పాల్ నాకు తెలుసు. మా కజిన్ మొగుడతను. మొన్నీమధ్య పెళ్ళయింది."

"ఓ గాడ్! చెప్పేరు కాదే."

"మీ రతన్తో చనువుగావున్న రోజుల్లో అతనికి పెళ్ళి కాలేదు. పెళ్ళికాని కుర్రాడు, అతన్తో చనువుగా తిరిగే ఆడ పిల్ల చనువుగాద్దీ యేది ఆజ్ఞాపిస్తే అది శిరసావహించడం, విడ్డూరంగాదు. మా కజిన్తో అతని పెళ్ళయింతర్వాత, మీ రతన్ని గమనించారో లేదోగాని యిప్పుడతను అఫుల్ స్మోకర్."

"అవునూ, యింత చెబుతున్నారు గనక అడగాలని పిస్తుంది. అతను నా గురించి మీకేమైనా చెప్పేడా?"

"చాలా చెప్పేడు."

"వొట్టి అమాయకుడతను."

"గనకనే, అతను మీ గురించి కొన్నాళ్ళపాటైనా సిగరెట్లు మానేడు."

"అదేం మాటలేండి. మీ కజిన్ చెప్పినా అతను సిగరెట్లు మానేస్తాడు."

పేకముక్కలు కలుపుతూ అన్నాను మెల్లిగా. కొంచెం బెరుగ్గా—

"ఇంత చదువుకున్న మీకు సృష్టి రహస్యం నేను వివరించడం మెచ్చతగదు కానీండి, ఒక్కటి మాత్రం నిజం. మగవాడు పెళ్ళాం మాటకన్నా నేస్తురాలి మాటకి విలువెక్కువ యిస్తాడు. దాన్ని మీ రొప్పుకుతీరాలి. అంతే."

"అందుకనే మీకథలు రాసేవాళ్ళంటే నాకు భయం. ఏదీ తిన్నగా మాట్లాడరు" అన్నది పద్మ ముసిముసిగా

నవ్వుతూ. పద్మ అందమయిన వేళ్లు పేకముక్కల్ని మరింత అందంగా కలపడం నేను పసిగట్టేను. ఆ వేళ్ళమీదికీ, అంతందమైన ఆ చేతిమీదికీ నా దృష్టి నిలిచింది. నాలోని దుష్ట మానవుడు నన్ను తొందరపెట్టాడు. చాలాసేపు ఆలోచించి.

"కాస్త మీ చేతినిలా యిస్తారూ!" అన్నాను.

"మీకు, హస్తసాముద్రికం వొచ్చునేమిటి?"

"ఏదో కొంచెం. ముందా చేతినిలా యివ్వండి" అన్నాను చొరవగా.

పద్మ చేతిని తాకి నన్ను నేనే మరిచేను. ఏదో చెప్పక తప్పదు గనక చాలా విషయాలు (ఊహించి) మహత్తరంగా చెప్పి పద్మని మురిపించేద్దామనుకున్నాను. కాని, ఆ ఆడపిల్ల నా మాయమాటలు నమ్మలేదో, ఏమోగాని నవ్వుతూ విన్నదంతే. అప్పుడు నా వొళ్ళు మండిపోయింది. పద్మని ఏడిపించాలనే ఉద్దేశంతో అతి సాహసంగా ఒకచిన్న బాణం విసిరేను.

"ఐయామ్ సారీ పద్మా! మీకు చెప్పకూడనిది తప్పనిసరై చెబుతున్నాను. మీ చేతిలోఉన్న వివాహ రేఖ చిత్రంగా వుంది. ఒకరకంగా వ్యాఖ్యానిస్తే–మీకు రెండు పెళ్ళిళ్ళు"

పద్మ ఆ మాటకి గలగలా నవ్వేసి తనచేతిని నా చేతుల్లో అలాగేవుంచి నిర్భయంగా అన్నది—

"సరిగ్గా చూడండిసార్! మును పెవరో నాకు నాలుగు పెళ్ళిళ్ళని చెప్పేరు. ఇప్పుడు నే నెవరిమాట నమ్మేది."

పద్మ చొరవకి నే నదిరి చచ్చేను.

* * *

కథ నింతవరకూ విన్న తర్వాత సుబ్బారావుకి కోప మొచ్చేసింది. చివాలున లేచి నించోబోయేడు. కాని, మందు ప్రభావం అతన్ని లేవనివ్వలేదు. అందుచేత వాడు కూచునే నన్ను తిట్టడం ప్రారంభించేడు.

“చెప్పకోరేయ్ బాబ్జీ! నువ్వు చెప్పేదంతా పచ్చి గాస్! ఏడాదిక్రితం నీకు పద్మ కలుస్తే యింతదాకా నా కెందుకు చెప్పేవు కాదు. అసలు నువ్వు పద్మని కలుసుకోడమే పెద్దకోత. దాని కింత కథా”

“నిజమేంగురూ! ఏడాదిక్రితం తిరుపతిబస్సులో నేనో అమ్మాయిని బాబ్జీప్రక్కన కూచోడం చూచేను. అయితే ఆ అమ్మాయి పద్మో కాదో తెలీదు. ఎందుచేతంటే నాకు పద్మెవరో తెలీదు” అన్నాడు ఆచారి.

“నువ్వు నోర్మూయ్‌రా చారిగా! ఎవర్ని చూచి ఎవరనుకున్నావోగాని, వీడు త్త రాడీవెధవ! వీడిదగ్గర అన్నీ కట్టు కథలే. ఏరా బాబ్జీ! నీతోనట్రా పద్మ మాట్లాడింది? ఫూల్! డామ్‌ఫూల్. నోరు మూసేయింక. పద్మకి రెండు పెళ్ళిళ్ళని చెప్పావా? డొక్క చీలుస్తా, పద్మచేతిని చూచే సాముద్రికం గాడివిట్రా నువ్వు. ఆ అమ్మాయితో పేకాటాడావ్. పద్మ నీలాగ జూదంమనిషి కాదురోయ్ రాడీ! ఒరేయ్! నన్ను కొట్టాలనివుంటె కొట్టు. చంపవతలపారేయ్. ఆచార్ని హాడి చేయ్. నేను కాదనను. కాని బాబ్జీ! వెధవ్వేషాలేసి నట్టు కథలు చెప్పకు. అవుట్. గెటవుట్ యూ రాస్కాల్! రేయ్

చారీ – నన్ను కొంచెం పట్టుకోరా బాబూ. లేవలేకుండా వున్నాను. ఏండా తాగించేడు ఫూల్. పోలాన్ తొందరగా కిక్ యిచ్చింది. ప్లీజ్ సాయం పట్టరా చారీ. వొస్తా రా బాబ్జీ నీ కథకీ నీకూ ఓ నమస్కారం. వొస్తా" ఆచారి సాయంతో వాడు లేవబోయేడు.

"ఎవడూ లేవద్దు లేస్తే మీ ప్రాణాలు తీస్తాను. కూర్చోండలా" గది దద్దరిల్లేలా అరిచేను. నా కళ్ళల్లోని ఎర్రదనం చూచేరో యేమోగాని యిద్దరూ కూర్చుండి పోయేరు. సుబ్బారావు సిగరెట్టు ముట్టించేడు. ఆచారి గ్లాసులో మందు నింపి నా ముందుంచేడు.

"నేను కథలు చెప్పన్రా సుబ్బారావ్ రాస్తాను. నేను చెప్పేది పచ్చినిజం. పద్మని కలుసుకున్నవైనం నీకు ఏడాది పాటు చెప్పలేదంటే — కారణం యేమిటనుకున్నావ్. పద్మ నన్ను అవమానించిందిరా గాడిద! ఆ కథా విను. వినంతె."

* * *

అర్ధరాత్రి అకస్మాత్తుగా మేలుకున్నాను. పడుకునే చుట్టూ చూసేను. నాకవతెలగా చిన్న గురకతో రామానుజం తలనిండా దుప్పటి కప్పుకుని పడుకున్నాడు. సరిగ్గా నా ముందున్న మంచంమీద హాలోలాలు పరుచుకొని పద్మ వెల్లకిలా పడుకున్నది. గదిలో వెలుగుతున్న లైటు వెల్తుర్ని మించిన ఛాయగల ఒకానొక అప్సరస అలిసిపోయి తర్వాత మైమరచి నిద్రిస్తున్న భంగిమను నేను చూచి కలవరపాటు చెందేను, లేచి నించుంబాగుననిపించింది

నిద్రలో పద్మ కొంచెం కదిలింది. ఆ కదలికలో నామతి పూర్తిగా పోయింది. పిచ్చివాడినై పోయేను, లేచినించున్నాను, సిగరెట్టు ముట్టించుకునేందుకు చేతులాడలేదు. నా శరీరంలో యేదో అద్భుతమైన చలనం కలిగింది, నేను దానికి పూర్తిగా లొంగిపోయేను.

నెమ్మదిగా పద్మవైపు నడిచి, ఆమెను చేరుకున్నాడు.

ఆమె మొహంలోకి, పెదాలమీద నా దృష్టి నిలిచింది. పద్మ నిద్రలో ఒక దరహాసాన్ని విసిరింది. పులకించి పోయేను, పుత్తడి బొమ్మలా మెరిసిపోతున్న పద్మని అతి దగ్గర్లో చూచింతర్వాత నేను సర్వం మరిచిపోయి ఫూల్నై పోయాను.

పద్మ మొహంమీదికి వొరిగేను.

"వండ్రఫుల్! అసాధ్యులేమీరు" అన్నది పద్మ కళ్ళు విప్పి.

లేచి నిటారుగా నించున్నాను. సిగ్గుతో తలవొంచేను. నిలువెల్లా వొణికి పోతున్నాను

"నేనేమీ అనుకోనుగాని వెళ్ళి పడుకోండి. రామానుజం లేస్తాడు _ గొడవచేయకుండా వెళ్ళిపొండి" అన్నది పద్మ మెత్తగా.

నేను నా పక్కమీద నడుం వాల్చిన తర్వాత అడిగింది.

"మనం చదువుకునే రోజుల్లోనేగా మీకు పెళ్ళయింది."

"......... "

"మీ ఆవిడెంతవరకు చదువుకున్నారేమిటి?"

"......... "

"అవును బాబ్జీగారూ..."

"ప్లీజ్ క్షమించండి పద్మగారూ. నేను పిచ్చివాణ్ణైపోయేను, ఆవేశానికి లొంగిపోయేను.

పద్మ అలలాగా నవ్వి అన్నది—

"ఏమిటో విడ్డూరంగా మాటాడుతున్నారు మీరు. నిష్కాములైన మహామునులే మీరనుభవించిన అవస్థకి తలలొంచి పారేసేరు. ఉప్పు కారంతినే మానవులం మన మెంత? నేనేమీ అనుకోను. మీరు యేమీ అనుకోవద్దు. ఉదయమే మనం స్వామిదర్శనం చేయబోతున్నాం. నిర్మలమైన మనసులో స్వామిని చూచేందుకు ప్రయత్నిద్దాం. సరేనా! గుడ్ నైట్."

"సే. బేడ్ నైట్ పద్మా" అన్నాను బాధగా.

* * *

సుబ్బారావు మొహంలో వెలగు నిండింది. అతి జాగ్రత్తగా వాడు కొన్ని మాటల్ని నా గుండెల్లో దించేసేడు.

"చూసేవా ఆచారీ! నా పద్మేమిటనుకున్నావ్. దేవతరా బాబు దేవత. నిప్పు నెంబరువన్. ఎన్ని యుగాలకైనా సరే. ఆ దేవతలాటి దేవత ఈ భూమ్మీద పుట్టదుగాక పుట్ట

దని రాసేసాను. ఛాలెంజి చేస్తాను. మునుపటి సుబ్రావని కాదురా నేను. నేను ప్రయోజకుడినై పోయేను సార్. సుబ్బారావ్ డిగ్రేట్ నై పోయేను. ఈ చేతుల్లో వేలూ లక్షలూ తిరుగుతుంటాయి. మా ఫాదరికి నే నొక్కడ్నిసంతానం. నాన్నా — పద్మకావాలి, అన్నాననుకో, యస్ సన్, కానుక్కో అనేస్తాడు నాన్న. తర్వాత మా పెళ్ళి. ఆకాశమంత పందిరి, భూదేవంత మందిరం. మా పద్మమ్మ పెళ్ళకూతురాయెనే, మా సుబ్బిగాడు పెళ్ళికొడుకాయెనే. రేయ్ బాజాలో. వాయించండ్రా వాయించండి. మాంచి త్యాగరాజు — ఒరేయ్ బాబ్జీ! త్యాగయ్య! త్యాగరాజురా?— ఎప్పుడైతేనేం. వాడికీర్తి నొకటి వాయించవతల పారేయండి. తలుపు దగ్గిర — నేనూ, పద్మ, పేర్లు చెప్పాలిగా. ఆల్ రైట్ నో ఫియర్స్. మనకి సిగ్గేమిటిసార్! నేనూ మా — బహువచనమేమిటోయ్ సన్నాసీ. బాజిగాడు జోస్యంలా, నేనూ నా పద్మ వొచ్చేశాం. పద్మా నువ్వూ చెప్పు సిగ్గుపడకు. చెప్పేయ్, కాని ఆచారీ నాకు పెళ్ళయిపోయింది గదరా! ఇంతచేసుంటే చూస్తూ నా పెళ్ళాం వూరుకుంటుందా? గనక లాభంలేదు. పద్మా మనం వొచ్చే జన్మలో కలుసుకుందాం...”

సుబ్బారావు నా కళ్ళల్లో నీళ్ళుతిరగడం చూసేడు గాబోలు, చప్పున నోరు మూశాడు. నేను కళ్లుతుడుచుకుంటూండగా ఆచారి ఉలిక్కిపడి అడిగేను. “అదేమిటి గురూ! నువ్వే—నువ్వేడుస్తున్నావా?”

నేను అనబడే ఈ బాబ్జీ ఇంతవరకూ ఏ విషయం

లోనూ యేడవలేదు. నే నేడవడమంటే యేనో మహాద్భుతం జరిగిందని అర్థం, అందుచేతనే ఆచారి అంత ఆశ్చర్యంగా అడిగేడు సుబ్బారావు మళ్ళా మాటలారంభించేడు.

“చూసేవా ఆచారీః గురుడేడుస్తున్నాడు. రేయ్ బాబ్జీ! నువ్వొనక్కవురా. నా కెక్కడపద్మదక్కుతుందోనని భయపడి చచ్చే వెధవ్వి. ఎందురా ఏడుస్తావ్? మనిద్దరికీ పెళ్ళిళ్ళై పోయాయిగా. నీమీద నేను, నామీద నువ్వూ ఏడవద్దు. సుఖపడనీ మరో మానవుణ్ణి మేగాడ్ బ్లెస్‌పద్మాస్ పార్టనర్. మేగాడ్ సేవ్ మి అండ్ బాబూరావ్! ఆచారి చెప్పవోయ్! మనింగ్లీషెలా వుంది? మన మొహాం లాగుందేమిటి. థేంక్సె ఫర్ ది కాంప్లిమెంట్. చెప్పరా బాబ్జీ? నీకథ కానివ్వు. దుఃఖం నటించకు నావాళ్ళుమంట కానివ్వు.

ఆ ఉదయమే మేము స్వామివారి దర్శనం ముగించుకున్నాం. ఎక్కడ్నుంచి పట్టుకొచ్చేడో, రామానుజం రెండు తెచ్చేడు. సరిగ్గా స్వామివారి ఆలయం ముందు నేనో విచిత్రాన్ని కళ్ళారా చూచి అదిరిపోయాను.

పద్మ మెళ్ళో రామానుజం, రామానుజం మెళ్ళో పద్మ దండలు వేసుకున్నారు. ఓ నిమిషం పాటు ఆలయం ముందే నించుని వాళ్ళిద్దరూ చేతులు జోడించి ఆ దేవదేవుడికి నమస్కారం చేసేరు, నా కవతల మతిపోతోంది. నేను తలదించేసుకు నించున్నాను. రామానుజం నాతో అన్నాడు.

“మా వివాహానికి మొదటిసాక్షి మీరు. మమ్మల్ని దీవించండి రాజుగారూ. మేమిప్పుడు దంపతుల మయ్యేం.

కొన్ని విపత్కర పరిస్థితుల దృష్ట్యా మేమిలా చేయవలసి వచ్చింది. మా కంటికెక్కనిపించే పెద్దలు మీరేసార్! సంసార సాగరంలో అడుగు పెడుతూన్న మమ్మల్ని మనసారా దీవించండి సార్!"

వాళ్ళిద్దరూ నాకు పాదాభివందనం చేసేరు.

నేను మనసారా వాళ్ళని దీవించేను. ఇదీ కథ. ఈ కథని ఇంకో పరిస్థితిలో మీకు నేను చస్తే చెప్పే వాడిని కాదు. కాని, నిన్నగాక మొన్న ఏలూర్లో నేనో దారుణం విన్నాను గనక ఇంత కథా మీకు నేను చెప్పేను.

రామానుజం ఏలూర్లో కనిపించేడు. మనిషి యావత్తూ నీరసంగా వుండి అతిభయంకరంగానూ వున్నాడు — పరిశీలించి చూస్తే అసహ్యంగానూ వున్నాడు.

నేనతని దగ్గిరికెళ్ళి నించుని పలకరించేను. అతను దేన్నో వెతుకుతున్నట్టు నా వేపు చూశాడు. నన్ను గుర్తించి అన్నాడు.

"ఏంసార్! జ్ఞాపకమున్నానా?"

నాకు ఒళ్ళు మండిపోయింది. మొట్టమొదటగా నేనే అతన్ని మరిచి పలుకరించేను. అంటే ఏమిటి — అతన్ని మరిచి పోయేనని అర్థమా? డామ్ సిల్లీ డాగ్!

నేను వెంటనే అడిగేను—

"ఎలావుంది మీ పద్మ? పిల్లలా?"

పద్మ విషయం అడగ్గానే అతను నిలువునా కూలిపోయాడు, ఆ సోడాషాపు దగ్గిర వేసిన బల్లమీద కూర్చుని.

మొహాన్ని చేతుల్లో దాచుకుని కుళ్ళికుళ్ళి ఏడవడం ప్రారంభించేడు. నాకు చెడ్డ కోత కలిగింది. నేనేతన్ని కోప్పడేలోగానే అతను తేరుకుని జాలిగా అన్నాడు.

"లేదుసార్! పద్మ లేదు. ధనుర్వాతం పద్మని పొట్టన పెట్టుకుంది. ఒక డాక్టర్ని మింగి మరో డాక్టర్ కళ్ళల్లో దుమ్ము కొట్టిందిసార్! మనకి పద్మ లేదిప్పుడు. అందం చచ్చిపోయి రెన్నాళ్ళయింది. ప్రేమ లేదిప్పుడు. నా పద్మ లేదు."

◆ ◆ ◆

సుబ్బారావు గోడనానుకుని కూర్చున్నాడు. వాడికి యేడ్చేపాటి ఓపిక లేక సొమ్మసిల్లి పడిపోయున్నాడు. వాడి ప్రక్కనే ఆచారి. ఇద్దరి మొహాల్లోనూ జీవం లేదు.

సుబ్బారావుకే చెప్పేను.

"నా దీవెన అమోఘంరా సుబ్బారావ్! నల్లబండని చూపించి అదిపిండై పోవాలని మనసారా దీవించేనంటే క్షణంలో బూడిదై పోతూంది. నువ్వింత పచ్చగా బతుకుతున్న వైభవాన్ని. నీ బతుకుమీద నా చూపుపడితే రెండో రోజుకల్లా "భిక్షాం దేహి మాతా అన్నపూర్ణేశ్వరీ" అంటూ పోతావ్. గనక కుర్రాళ్ళూ! బతికి బట్టకట్టుకోవాలనుకున్న జనంగాళ్ళు నన్ను దీవించమని అడగరాదు. అలా అడిగేకా దీవించేందుకు నేను వెనకాడను గాని వాళ్ళఖర్మ కాలిపోయి

దని మాత్రం ఖచ్చితంగా చెబుతాను. సంవత్సరం క్రితం రామానుజాన్ని, పద్మని దీవించేను, వాళ్ళపట్ల నానున్న జెలసీని దాచుకొని. పద్మమీద నేను పెంచుకొన్న "కోరిక" నోరుమూసి దీవించాను. దాని ఫలితమే పద్మ దిక్కుమాలిన చావు. అర్థమైందట్రా! సెహభాష్... భస్మాసురుడి బాబున్నేను. తప్పుకోండి నేను వెళ్ళిపోవాలి. మరోయెదుటి మనిషి నెత్తిమీద నా హస్తం వుంచాలి, దారివ్వండి..."

గబగబా రోడ్డుమీద కొచ్చేసేను. అయితే నాకు రోడ్డుగానీ, దానిమీద వాస్తువులుగానీ స్పష్టంగా కనిపించడం లేదు. నా శరీరంలోని అన్ని శక్తులూ కలసి నామీద స్వారీ చేస్తున్నట్లనిపించింది. నడిరోడ్డుమీద వొరిగి పోవడమే తెలుసు నాకు.

మళ్ళా కళ్లు విప్పినప్పుడు నేను ఆచారి గదిలో వున్నట్లు గమనించేను. నా ముందున్న ఆచారి, సుబ్బారావూ యిద్దరూ దిగులుగా ఆందోళనగా నావేపు చూస్తున్నారు.

నాపట్ల వాళ్ళ స్నేహానికి నేను ముగ్ధుడనయ్యేను. "కళ్లు విప్పేడుగురో! బతికించేవురా బాబూ, అదిరి చచ్చేం" అన్నాడు, ఆచారి కళ్ళల్లో ఆనందం నింపుకు!

"నీ మనస్సు వెన్నరా వెధవా! ఉత్తపిచ్చి సన్నాసివి" అన్నాడు సుబ్బారావు నా తల నిమురుతూ. వాడికనుకొలకుల్లో నీళ్లునిలిచి వున్నాయి. సుబ్బారావు మాటతో నా మనస్సు కదుటపడింది.

—ఆంధ్రజ్యోతి (వారపత్రిక) 18-8-1967